కోటీశ్వరుని హత్య!

టెంపోరావ్

వాలిగారు పడకకుర్చీలో కూర్చుని చుట్ట కాలుస్తూ ఏదో చూస్తున్నారు. అప్పుడే గదిలోకొచ్చి నేనాయన ఎదురుగా నిలబడ్డాను.

"గిరీ, మనం వెంటనే వెళ్ళాలి," అన్నాడాయన.

"ఎక్కడికి?" ప్రశ్నించాను.

తన చేతిలో వున్న కాయితాన్ని ఆయన నాకిచ్చారు. టెలిగ్రామ్! వేగంగా చదివాను. వెంటనే నెల్లూరువచ్చి ఒక హత్యకేసులో తనకు సహాయపడమన్నాడు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు.

టెలిగ్రామ్ చదివి వాలిగారివైపు చూశాను.

"ఏదో పెద్ద హత్యకేసయితేగాని సుబ్బారావు నాకు టెలిగ్రామ్ యివ్వడు. మరో పావుగంటలో కారులో వెళ్దాం," అన్నారాయన.

XYZ కారులో నెల్లూరు చేరుకున్నాం. పాతబడిన పోలీస్ స్టేషన్ ముందు కారు ఆపాను. మమ్మల్ని చూసి

ఒక కానిస్టేబుల్ లోపలకు పరుగెత్తాడు. పెద్ద అంగల్లో ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు కారు దగ్గరకొచ్చి వాలిగారికి నవ్వుతో నమస్కరించాడు.

"సుబ్బారావు భాయ్, ఎలా వున్నావు?" అడిగాడు వాలిగారు.

"అంతా బాగానే వుంది సార్. వెంటనే వచ్చినందుకు మీకు నా ధన్యవాదాలు. మీ కారులో నేను వస్తాను. జీప్ వెనకనే వస్తుంది."

ఇన్‌స్పెక్టర్ నన్ను విష్ చేసి వెనుక సీటుమీద కూర్చొని తలుపు మూశాడు. కారును పోనిచ్చాను. వెనకనే పోలీస్ జీప్ వస్తోంది.

పక్కకు తిరిగి వాలిగారు వెనుక కూర్చున్న ఇన్‌స్పెక్టర్ వంక చూశారు.

"హత్య గురించి ముఖ్య విషయాలు చెప్పు!"

"హత్యచేయబడిన వ్యక్తి ప్రముఖ పారిశ్రామికవేత్త కతుల బలరామ్. ఆయన పేరు మీరు వినేవుంటారు" అని ఇన్‌స్పెక్టర్ ఆగాడు.

"ప్రొసీడ్!" అన్నారు వాలిగారు.

ఎలా కారును పోనివ్వాలో నాతో చెప్పి ఇన్‌స్పెక్టర్ వాలిగారివేపు తిరిగాడు.

"క్రితం రాత్రి పది తర్వాత యీ హత్య జరిగుండాలి. ఆయన ఆరో భార్య సుమలతను తాళ్ళతో మంచానికి కట్టేశారు. భర్తను చంపుతుంటే ఆమె యేమీ చెయ్యలేని స్థితిలో వుండవలసి వచ్చింది. హత్య జరిగిన గదిలో అన్నీ అలాగే వున్నాయి. ఏ వస్తువులనూ కదల్చవద్దని నేను వుత్తరువిచ్చాను. సుమలతను మాత్రం కట్లువిప్పి విడుదల చేసాం" అన్నాడు సుబ్బారావు.

ఎడం వైపుకు తిప్పి కారును పోనిచ్చాను. పెద్దగేటు యెదురుగా కనిపిస్తోంది. కోట సింహద్వారంలా వుంది. గేటుపక్కన ఒక వాచ్‌మన్, పోలీసు కానిస్టేబులు నిలబడి వున్నారు.

గేటు తెరవబడింది. కారును లోపలకు పోనిచ్చాను. సిమెంటు రోడ్డు. రోడ్డు కిరువైపులా పూల మొక్కలు. దూరంలో నీలిరంగు మేడ కనిస్తోంది. వివిధరకాల చెట్లు కాంపౌండులో అగుపిస్తున్నాయి. కత్తుల బలరామ్ కోటీశ్వరుడయి వుండాలి.

పోర్టికోలో కారాపాను. వాలిగారూ, ఇన్‌స్పెక్టర్ సుబ్బారావూ దిగారు.

"ఆ పార్కింగ్ ప్లేస్‌లో కారాపి రండి," అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాతో.

కారును పోనిచ్చి పార్కింగ్ ప్లేస్‌లో ఆపి, దిగాను. పోలీస్ జీప్ పక్కనే ఆగింది. ముగ్గురు కానిస్టేబుల్సు కిందకు దూకేరు.

పోర్టికోలోంచి వరండామీదుగా ముందు హాల్లోకి వెళ్ళాను. చుట్టపొగ వదల్తూ వాలిగారూ, ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు హాల్లో వున్నారు.

పెద్దహాలు. అందమయిన సోఫాలు నలభై పైన హాల్లో వున్నాయి. గోడలకు ఆయిల్ పెయింటింగ్సు అమర్చబడి వున్నాయి.

"రండి లోపలకు," అన్నాడు సుబ్బారావు.

ఇన్‌స్పెక్టర్ వెనుకనే వాలిగారు లోపలకి వెళ్ళారు. వాళ్ళను వెంబడించాను. ఒక గదిముందు కానిస్టేబుల్ కాపలావున్నాడు. అతడు అటెన్షన్‌తో శల్యూట్ చేశాడు. వాళ్ళు గదిలోకి వెళ్ళారు. వెనుకనే నేను

నడిచాను.

పెద్ద పడగ్గది. గదిలో రెండు ఫ్యాన్‌లు తిరుగుతున్నాయి. లైట్లు వెలుగుతున్నాయి. గోడవారగా ఎత్తయిన మంచం వుంది. మంచంమీద రెండు ఫోమ్ పరుపులు, చక్కటి తలగడలు. పైన పర్చిన వెల్వెట్ దుప్పటి మెరుస్తోంది.

మంచానికి దూరంలో నేలమీద పడున్న వ్యక్తిని వాలిగారు పరీక్షిస్తున్నారు. అతడి వయస్సు యాభయి పైన వుంటుంది. పొడుగ్గా, సన్నగా వున్నాడు. టెర్లిన్ పాంటు, స్లాకు ధరించాడు. అతడు వెల్లకిలా పడి వున్నాడు.

అతడిని పరీక్షగా చూస్తూ వాలిగారి పక్కనే నుంచున్నాను. అతడి మెడ నరికివేయ బడింది. నేలను కప్పిన తివాసీమీద విపరీతంగా రక్తంపడి నిండిపోయింది.

శవం పక్కనే కత్తి పడుంది. కత్తికి ఎర్రటి పిడి! కత్తిమీద రక్తం మరకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అంతవరకూ వంగిచూసిన వాలిగారు లేచి ఇన్‌స్పెక్టర్ వంక చూశారు.

"ఈగది యెవరిది?"

"ఇది సుమలత పడగ్గది సార్."

"అమ్మాయి ఎక్కడుంది?"

"పక్కనున్న భర్తగదిలో ఆమె నిద్రపోతూ వుండాలి. ఇదంతా చూడ్డం మూలంగా ఆమె మెదడుకు షాక్ సంభవించింది. సెడేటివ్ యిచ్చి డాక్టరు ఆమెను ప్రక్కగదిలో పడుకోబెట్టారు," అన్నాడు సుబ్బారావు.

"భర్త కళ్ళముందు మరణించడం భారత స్త్రీకి పెద్ద

పాకే" అన్నారు వాలిగారు.

వాలిగారు గది నాలుగువైపులా తిరిగి అంతా పరికిస్తున్నారు. ఒక రోజ్‌వుడ్ టేబులుమీద వాట్ 69 స్కాచ్ విస్కీ బాటిలు వుంది. పక్కనే రెండు గ్లాసులు వున్నాయి. వాటివైపు చూస్తూ వాలిగారు ఆగారు. విస్కీబాటిల్లో సగంపైన మత్తుద్రవం వుంది.

"ఈ గదిలోకి వచ్చిన యిద్దరూ ఆ గ్లాసుల్లో విస్కీ పోసుకొని తాగి పారిపోయారుట. అదంతా సుమలత నాతో చెప్పింది" అన్నాడు సుబ్బారావు.

"జరిగినదంతా అమ్మాయి నీతో చెప్పిందన్నమాట."

"చెప్పింది సార్. ఆమె నిద్రలోంచి మేల్కొన్నది, గదిలో చప్పుడు విని. మంచం పక్కనున్న స్విచ్‌లు నొక్కింది. గదిలోని లైట్లు వెలిగాయి. బీరువా ప్రాంతంలో వున్న ఇద్దరు మనుషులవైపు ఆమె గాభరాగా చూసింది.

ఆమె కెవ్వున అర్చింది. పక్క గదిలో వున్న భర్త ఆమె కేక విని వచ్చాడు. ఒకతను ఆమెను కదలకుండా పట్టుకున్నాడు. రెండో అతను గోడకు వేళ్ళాడుతోన్న కత్తినితీసి బలరామ్‌గారి మెడను నరికేశాడు. ఆయన అరుస్తూ కిందపడ్డారు."

"ఇంట్లోవున్న నౌఖర్లు యేమయ్యారు?" అడిగారు వాలిగారు, మంచం కాలు ప్రాంతంలో వున్న నైలాన్ తాడువైపు చూస్తూ.

"గూర్ఖా వాచ్‌మన్ గేటుముందు వుంటాడు. తోట పనిచేసే నాగులు, సోములు వాళ్ళ కుటుంబాలతో వెనుక నిర్మించబడిన క్వార్టర్సులో వుంటారు. ఈ భవనంలో సుమలత ఆమె భర్త మాత్రం వుంటారు. వంటామె ఆది

లక్ష్మి డైనింగ్ హాల్లో పడుకుంటుంది. ఆమె నిద్రపోతే ఒకంతట లేవదు."

హత్యకు ఉపయోగించిన కత్తిమీదకు మళ్ళింది వాలి గారి దృష్టి.

"ఆ కత్తి ఎవరిది?"

"అది బలరామ్ తాతగారి కత్తిట. ఎంతకాలంనుంచో అది గోడమీదున్న మేకుకు వేళ్ళాడుతూ వుండేదట."

ఒక కానిస్టేబుల్ గదిలోకొచ్చి యినస్పెక్టర్‌తో ఏదో తగ్గు స్వరంలో చెప్పాడు.

"వాలిగారూ, సుమలత మేల్కొన్నదట. ఆమె ఏ సితిలోవుందో చూసి వస్తాను," అని యినస్పెక్టర్ సుబ్బారావు ఫరుగెత్తాడు.

గదిలో క్షణకాలం నిశ్శబ్దంగా వుంది. చుట్టపొగ వదులూ వాలిగారు నలువైపులా చూస్తూ ఆలోచిస్తున్నారు. ఆయన దగ్గరగా జరిగాను.

"దొంగతనం కోసం ఈ హత్య జరిగిందంటారా?" అడిగాను.

"దొంగకు అడ్డుపడితే చంపడానికి వెనుదీయడు!" అన్నారాయన క్లుప్తంగా.

"ఈ భవనంలోకి దొంగలు ఎలా ప్రవేశించారో?"

"అది మనం కనుక్కోవాలి!"

గబ గబా యిన్‌స్పెక్టర్ సుబ్బారావు గదిలో కొచ్చాడు.

"డాక్టర్ ఆమెతో వున్నారు. అరగంట తర్వాత మీరు ఆమెతో మాట్లాడవచ్చని డాక్టర్ అన్నారు," అని ఇనస్పెక్టర్ సుబ్బారావు చెప్పాడు.

"మంచిది," అని వాలిగారు తలాడించారు.

సుమలత వయసు యిరవై ఐదు వుంటుందేమో! కాని ఆమె యిరవై రెండేళ్ళ స్త్రీలా కనిపిస్తోంది.

సోఫాలో కూర్చొని వున్న ఆమెను చూడగానే నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆమె చాలా అందంగా వుంది. పొట్టిగా, పచ్చగా అప్పుడే వికసించిన పువ్వులా వుందామె. ఏదో బాధ ఆమె మొహంలో గోచరిస్తోంది.

ఆమె మా అందర్కీ నమస్కరించి కూర్చోమంది. ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నాం. ఇది బలరామ్ పడగ్గది. హత్య జరిగిన గది పక్కనే వుంది.

వాలిగారు ఆమెవంక కొంతసేపు మౌనంగా చూశారు.

"అమ్మాయి, ఏం జరిగిందో చెప్పు!" అన్నారాయన.

"నేను చూసినదంతా ఇన్‌స్పెక్టర్‌కి చెప్పాను. మళ్ళీ చెప్పడం దేనికి?" అందామె.

"అంతా చూసిన నువ్వు చెప్పడం మంచిది. నీ భర్తను ఎవరు హత్యచేశారో తెల్సుకోడానికి వుపయోగపడ్తుంది" అన్నారు వాలిగారు.

గది చాలా విశాలంగా వుంది. దూరంలో పెద్ద మంచం. ఎత్తయిన పరుపు. గదిలో స్టీల్ బీరువాలు, రోజ్‌వుడ్ టేబుల్, టీపాయ్ వగైరాలున్నాయి. గోడకున్న మేకుకి టెన్నిస్ రాకెట్ వేళ్ళాడుతోంది.

"వాలిగారూ, నిన్న రాత్రి పదింటికల్లా నేను నిద్ర పోయాను. ఏదో చప్పుడై లేచాను. గదిలో చీకటిగా వుంది. నా పరుపు పక్కనే వున్న స్విచ్‌లు నొక్కాను. వెంటనే లైట్లు వెలిగాయి. తెరిచిన బీరువాముందు నిలబడి వున్న యిద్దరు మనుషుల్ని చూసి గాభరాగా అర్చాను. మంచంమీదనుంచి కిందకు దూకాను. ఒకతడు పరుగెత్తు కొచ్చి నన్ను పట్టుకొని నోరు నొక్కేశాడు. కాస్సేపట్లో

ఆయన పక్క తలుపు తెర్చుకుని నా గదిలోకొచ్చారు. నన్ను పట్టుకున్న మనిషివైపు ఆయన కోపంగా చూశారు. 'రాస్కెల్, ఆమెను వదులు!' అని ఆయన అర్చారు. గోడవారగా ఆయన వెనకనున్న రెండోమనిషి మేకుకు వేళ్ళాడుతున్న కత్తిని చేతిలోకి తీసుకున్నాడు. గట్టిగా అరవాలనుకున్నాను. కాని అరవలేని స్థితిలో వున్నాను."

ఆమె కళ్ళు మూసుకుంది. జాలిగా ఆమెవైపు చూస్తూ వుండిపోయాను. ఆమె కళ్ళమ్మట కన్నీళ్ళు కారుతున్నాయి.

"అమాంతంగా అతడి చేతిలోని కత్తి ఆయన మెడ మీదకు బలంగా దిగింది. ఆయన అరుస్తూ కిందపడ్డారు. అటుపైన వాళ్ళిద్దరూ నన్ను మంచం కాలుకి నైలాన్ తాడుతో కట్టేశారు. నోట్లో గుడ్డలు కుక్కేశారు. నిస్సహాయంగా కూర్చుని జరిగినదంతా చూస్తూ వుండిపోయాను. బీరువాలోని నగలు, డబ్బు, వెండి పాత్రలు నల్లటి తోలు బాగ్‌లో పడేసుకుని లిక్కర్ కాబినెట్ దగ్గరకు వెళ్ళారు. అక్కడవున్న విస్కీ బాటిల్స్, రెండు గ్లాసులను టేబుల్ దగ్గరకు తెచ్చారు. అరగంటపైదాకా విస్కీ సేవిస్తూ నిలబడ్డారు. అటుపైన బాగ్ పట్టుకుని వెళ్ళిపోయారు."

"వాళ్ళు ఎటువైపు వెళ్ళారు?"

"ఆయన గదిలోకి వెళ్ళారు. అక్కడినుంచి ఎలా బయటకు పోయారో నాకు తెలియదు" అందామె.

"బాత్‌రూమ్ తలుపు తెరిచి వాళ్ళు బయటకు పోయారు, సార్. ఆ తలుపు యింకా తెరిచే వుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు.

వాలిగారు లేచారు. యటాచ్డ్ బాత్‌రూంలోకి

ఆయన వెనకనే వెళ్ళాను. తలుపు తెరిచివుంది. అటువైపు నున్న తోట కనబడింది.

"ఇలా వాళ్ళు పోయారు సార్," అన్నాడు ఇన్స్పెక్టర్.

ఘుర్గురం తిరిగి పడగ్గదిలోకి వచ్చి సోఫాల్లో కూర్చున్నాం.

వాలిగారు ఆలోచిస్తూ చుట్టపొగ వదులుతున్నారు.

"అటువైపునుంచే వాళ్ళు భవనంలో ప్రవేశించి వుండాలి." అన్నారాయన.

"అవును సార్," అన్నాడు ఇన్స్పెక్టర్ సుబ్బారావు.

వాలిగారి చూపు ఆమె వైపు వెళ్ళింది.

"అటుపైన ఏం జరిగింది?"

"నా నోట్లోని గుడ్డపీకల్ని మెల్లిగా బయటపడేసి గట్టిగా అరవసాగాను. రెండు నిముషాల తర్వాత ఆదిలక్ష్మి గదిలోకొచ్చింది. నన్ను, ఆయన శవాన్ని చూసి ఆమె హడలిపోయింది. వెంటనే పోలీసు రిపోర్టివ్వమన్నాను. నా గదిలోంచే ఆమె ఫోన్ చేసింది. పోలీసులు పావుగంటలో వచ్చారు. నన్ను తాళ్ళనుంచి బయటకు తీశారు."

ఇన్స్పెక్టర్ సుబ్బారావు సోఫాలోంచి లేచి మా ఎదురుగా వచ్చాడు.

"కదలకుండా ఆమెను కట్టేశారు. చేతులు వెనక్కి విరిచి కట్టారు. ఆమెను కట్టిన తాడు యింకా అక్కడే వుంది," అన్నాడు ఇన్స్పెక్టర్.

"చూశాను." అన్నాడు వాలిగారు.

ఆరిపోయిన చుట్టను ఆయన లైటర్తో వెలిగించారు.

ఆయన సూటిగా ఆమెవైపు చూశారు.

"అమ్మాయి వాళ్ళిద్దర్నీ వర్ణించగలవా?"

"ఆయన్ని హతమార్చి నతడు పొడుగ్గా, బలంగా వున్నాడు. గిరిజాల జుత్తు నల్లపాంట్, స్పోర్ట్స బనియన్ వేసుకున్నాడు. మధ్యలో వెడల్పయిన బెల్టు. నన్ను పట్టుకున్నతను కుర్రాడు. వయస్సు యిరవై వుంటుందేమో. అతనూ పొడుగ్గా వున్నాడు. సన్నటి మనిషి. అతడు పాంట్ టీషర్టు ధరించాడు. అతడికీ బెల్టుంది. ఇద్దరూ నల్లగా వున్నారు."

"దాన్నిబట్టి వాళ్ళెవరో మనం వూహించవచ్చు!" అన్నాడు సుబ్బారావు.

"ఎవరు వాళ్ళు?"

"గజదొంగ బాజీప్రసాద్, అతడి కొడుకు తాజీ ప్రసాద్. ఈ ప్రాంతంలో వాళ్ళు చాలా దొంగతనాలు చేశారు, చేస్తున్నారు. వాళ్ళకోసం పోలీసులు వెతుకుతున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు లేచాడు. టేబుల్ మీద పాత దిన పత్రికలు ఎత్తుగా పేర్చబడి వున్నాయి. అక్కడకు వెళ్ళి వెతికి ఒక పత్రిక తీసుకొని వచ్చి వాలిగార్కి చూపించాడు.

"ఈ ఫోటో చూడండి!"

వాలిగారూ, నేనూ ఫోటోవంక చూశాం. బాజీ ప్రసాద్, తాజీ ప్రసాద్ పక్కపక్కనే నిలబడివున్నారు. సుమలత వర్ణించినట్లే వున్నారిద్దరూ!

వాలిగారు ఎందుకో విచిత్రంగా నవ్వారు.

"ఈ యిద్దరూ ఏ వూరివాళ్ళు?"

"బాజీ ప్రసాద్ యింతకుముందు మూడు, నాలుగు

సార్లు జైలుకి వెళ్ళాడు. కాని జైల్లో ఎక్కువరోజులు వుండలేదు. బయటకు పారిపోయాడు. పెద్దవాడైన కొడుకు కూడా తండ్రితో కలిసి పనిచేస్తున్నాడని మాకు సమాచారం అందింది. వాళ్ళిద్దరూ యీ వూరి వాళ్ళే."

"బాజీ ప్రసాద్ భార్య ఎక్కడుంది?"

"ఆమె యిదే వూర్లో వుంది. వాళ్ళను గురించి తన కేమీ తెలియదంటుంది. ఆమె మంచిది. ఆమెకు దైవ భక్తి ఎక్కువ. ఒక సి. ఐ. డి. యిరవైనాలుగ్గంటలూ ఆమెను గమనిస్తూ వుంటాడు. కాని యింతవరకూ మాకు ఏమీ తెలియలేదు," అన్నాడు సుబ్బారావు.

చుట్టపీలుస్తూ వాలిగారు సోఫాలోంచి లేచి ఆమె ముందుకు వెళ్ళారు.

"అమ్మాయి, నీకు బలరామ్‌తో ఎలా పరిచయ మయింది?"

"అదంతా పెద్ద కథ సార్," అందామె.

"అదంతా నువ్వు చెప్తే నేను వింటాను," అని వాలి గారు ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగారు.

"సుబ్బారావు భాయ్, నువ్వు నీ పని కానీ! శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపు. విస్కీబాటిల్ మీద, గ్లాసుల మీద, కత్తి పిడిమీద వేలిముద్రలు ఉన్నాయేమో చూడమను," అన్నాడాయన.

"అంతా చేయిస్తాను సార్," అని యిన్‌స్పెక్టర్ పక్క గదిలోకి వెళ్ళిపోయారు.

3

సుమలత విచారవదనంతో మావైపు చూసింది.

"వాలిగారూ, బొంబేలో బలరామ్ గారితో నాకు

పరిచయమయింది. నేను హిందీ సినిమాల్లో చిన్న పాత్రలు ధరిస్తూ ఉండేదాన్ని. అన్నయ్య, అమ్మ తప్ప నాకెవ్వరూ లేరు. అన్నయ్య ఆర్మీలో చేరిపోయాడు. సినిమాల్లో నటించి ఆ ఆదాయంతో మేం జీవించేవాళ్ళం. బలరామ్‌గారు నన్ను పెళ్ళాడ్తానన్నారు. పేదరికంతో నాకు విసుగెత్తిపోయింది. సినిమా రంగంలో చిన్న పాత్రలు వేస్తూ పదిమందికి తలొంచి జీవించడంకంటె ఒక వ్యక్తికి భార్యనై ఉండడం మంచిదనిపించి ఒప్పుకున్నాను. పెళ్ళయినాక నేను ఆయనతో యిక్కడికొచ్చేశాను."

"నీ తల్లి ఏమయింది?"

"ఆరునెలల క్రితం ఆమె చనిపోయింది."

"నీ అన్న నీకు ఉత్తరాలు రాస్తూ ఉంటాడా?"

"అన్నతో పూర్తిగా బంధం తెగిపోయింది. అన్నయ్య ఎక్కడున్నాడో, ఏమయినాడో తెలియదు. అమ్మ పోయినపుడు కూడా అతడు రాలేదు."

"బలరామ్‌తో నీ జీవితం సుఖంగా సాగేదా?"

ఆమె వెంటనే జవాబివ్వలేదు. మావైపు మౌనంగా చూసింది.

"ఈడూ జోడూ కలియని సంసారం మాది. ఆయన మొదట్లో నన్ను బాగా చూసేవారు. ఆరునెలల తర్వాత నేను పాతదాన్నయిపోయాను! ఆయన తాగుడులో మునిగి తేల్తూ జీవించేవారు. ఆయనకు జీవితంలో చాలా ప్రియమయినది—ఆల్కహాల్!"

"తాగుడులో అతడు నిన్ను కొట్టేవాడా?"

"అంతపని ఎన్నడూ చెయ్యలేదు. క్షణంలో ఆయనకు కోపం వచ్చేది. ఆ సమయంలో ఆయనకు దూరంగా

ఉండేదాన్ని."

"మీ పెళ్ళయి ఎంత కాలం అయింది?"

"రెండేళ్ళయింది—"

"నువ్వు అతడి ఆరో భార్యవని విన్నాను. అతడి ఐదుగురు భార్యలు ఏమయ్యారు?"

"ముగ్గురు మరణించారని విన్నాను. ఇద్దర్ని ఆయన డైవర్స్ చేసేశారు."

"ఆయనకు సంతానం లేదా?"

"లేదు."

ఆమెవైపు వాలిగారు సూటిగా చూశారు.

"అమ్మాయి, నాకు తెలిసినంతమటుకు బలరామ్ కోటీశ్వరుడు. అతని ఆస్తి నీకే వెళ్తుందా?"

"ఆయన భార్యనుగా? నాకు గాక మరెవరికి వెళ్తుంది?" అామె విచిత్రంగా ప్రశ్నించింది.

"అతడు వీలునామా రాశాడా?"

"నాకు తెలియదు. రాసినట్లు ఆయన చెప్పలేదు. అడ్వకేటు చంద్రంగార్ని అడిగితే తెలుస్తుంది."

"నీ భర్తకు ఎవరేనా శత్రువులున్నారా?"

"నాకు తెలియదు. అటువంటివేమీ ఆయన నాతో మాట్లాడేవారుకాదు. నిజం చెప్పాలంటే ఏ విషయం గురించీ ఆయనతో మాట్లాడలేము. ఆయన ఎప్పుడూ నిషాలో ఉండేవారు."

"అతడు యింతకుముందు తాగేవాడా?"

"మునుపు తక్కువగా తాగివుండొచ్చు. ఈ మధ్య తాగుడు ఎక్కువైంది," అందామె.

"గదిలోకొచ్చిన ఆ యిద్దరు దొంగలూ ఎంత పట్టుకుపోయారో చెప్పగలవా?"

"చెప్పలేను సార్. వాళ్ళు నా ఒంటిమీదున్న నగలు తీసుకుపోలేదు. బీరువాలో ఉన్నవి పట్టుకు పోయారు. ఎంత డబ్బు పట్టుకుపోయారో నేను చెప్ప లేను. నా బీరువాలో ఎంత డబ్బుందో నాకే తెలియదు." అందామె.

వాలిగారు మాట్లాడలేదు. చుట్టపొగ వదుల్తూ ఆమె వైపు చూస్తున్నారు.

"వాలిగారూ, ఇంట్లో ఎంత బంగారముందో నాకు తెలియదు. నా గదిలోని బీరువాల్లో ఎన్నో ఆభరణాలు ఉంటాయి. నోట్ల కట్టలు కుప్పలుగా పడుంటాయి. అదంతా పరీక్షగా చూసే తీరిక నా కెన్నడూ లేదు," అందామె.

"అమ్మాయి సముద్రంలోని నీళ్ళను ఎవరు కొలవ గలరు?" అన్నారు వాలిగారు చిరునవ్వుతో.

ఆయన గుమ్మంవైపు వెళ్తూ ఎందుకో ఆగి ఆమెవంక తీవ్రంగా చూశాడు.

"అమ్మాయి గత రాత్రి యీ భవనంలో ప్రవేశించి నీ భర్తను హతమార్చిన వాళ్ళిద్దరికోసం నేను అన్వే షిస్తాను. అది నీ కిష్టమేగా?"

ఆమె వాలిగారివంక సూటిగా చూసింది. నీళ్ళతో నిండిన కళ్ళను తుడుచుకుంది.

"వాలిగారూ, బలరామ్‌గారు నా భర్త. ఆయన యిలా హత్య చేయబడినందుకు నేనెంతగానో విచా రిస్తున్నాను. వాళ్ళిద్దర్నీ మీరు పట్టుకుంటే నేనెంతో సంతోషిస్తాను. ఆయన ఆత్మకు శాంతి చేకూర్తుంది," అందామె.

వాలిగారు పెద్ద అంగల్లో పక్కగదిలోకి వెళ్ళిపోయారు. వెనకనే వేగంగా వెళ్ళాను.

4

సుమలత పడగ్గదిలో శవం లేదు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వాలిగారివైపు వచ్చాడు.

“శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపించాను. ఆ గ్లాసుల మీద, కత్తిపిడిమీద వేలిముద్రలు లేవు!” అన్నాడతను.

వాలిగారు మెల్లిగా మంచం దగ్గరకి వెళ్ళారు. మంచం కాలుకు కట్టబడి వున్న నైలాన్ తాడును పరీక్షించారు. కొన్ని గుడ్డపీలికలు తివాసీమీద పడున్నాయి. ఈ గుడ్డ పీలికలు ఎక్కడ నుంచి వచ్చాయి? మంచం మీదున్న తలగడ వైపు ఆయన చూపు వెళ్ళింది. తలగడ గలేబు ఒకవైపున చింపబడి వుంది.

వాలిగారు వెనక్కి తిరిగి స్టీలు బీరువాల దగ్గరకు నడిచారు. ఒక బీరువాను తెర్చారు. అందులో పట్టుచీరలు, ఖరీదయిన దుస్తులు వున్నాయి. ఆయన రెండో బీరువాను తెర్చి చూశారు.

నోట్లకట్టలు యెన్నో వున్నాయి. కొన్ని అరలనిండా నగలున్నాయి.

“దొంగలు పూర్తిగా దోచుకుపోలేదు!” అన్నారాయన నాకేసి చూస్తూ.

“అంతా మొయ్యలేక వదిలేశారేమో!” అన్నాను.

లిక్కర్ కాబినెట్ దగ్గరకు వెళ్ళారాయన. గాజు తలుపుగుండా లోపలున్న బాటిల్స్ వైపు చూశారు. స్కాచ్ విస్కీ బాటిల్స్! బ్రాందీ బుడ్డీలు! జిన్, బీర్ బాటిల్సుకూడా వున్నాయి.

ఏదో ఆలోచన తట్టి ఆయన వేగంగా పక్కగదిలోకి

వెళ్లారు. సుమలత సోఫాలో కూర్చుని కునికిపాట్లు పడుతోంది.

"అమ్మాయి, సారీ, నిన్ను డిస్టర్బ్ చెయ్యవలసి వచ్చింది!" ఆమె కనురెప్పలు చిట్లిస్తూ మావైపు చూసింది.

"లిక్కర్ కాబినెట్ నీ గదిలో వుంది. అతను నీ గదిలో కూర్చుని తాగేవాడా?"

"ఆయన యిష్టమొచ్చినచోట కూర్చుని తాగేవారు. నా గదిలో ఆయన తాగడం ప్రారంభిస్తే నే నాయన గదికిపోయి కూర్చునేదాన్ని. లేకపోతే తోటలో తిరిగేదాన్ని."

"ఆ నైలాన్ తాడు ఎవరిది?"

"మాదే. ఒకచుట్ట టేబుల్ మీద వుండేది. దాన్ని వాళ్ళు తీసుకున్నారు."

"వాళ్ళ చేతులకు గ్లవ్స్ వున్నాయా?"

"లేవు సార్."

"వెళ్ళిపోయేముందు వాళ్ళు గ్లాసులనూ, కత్తిపిడినీ తుడిచేశారా?"

"మీరు అడిగితే గుర్తొచ్చింది. తుడుస్తూంటే నేను చూశాను."

వాలిగారు ఆమెవైపు సూటిగా చూశారు.

"వాళ్ళు యెంతపట్టుకెళ్ళారో మనకు తెలియదు కాని చాలా వదిలేశారని తెలుసు!"

"నేనున్న పరిస్థితిలో బీరువాలు తెరిచి ఎంతపోయిందో చూసే అవకాశం నాకు దొరకలేదు సార్" అందామె దీనంగా.

"వంటామె యెంతకాలం నుంచి యిక్కడ పని

చేస్తోంది?"

"నే నిక్కడ కొచ్చాక ఆమెను పనిలో పెట్టాను."

"ఆమెకూడా బొంబేనుంచి వచ్చిందా?"

"బొంబేలో ఆమె నాకు తెలుసు. నేనే ఉత్తరం రాసి రప్పించాను."

"పడుకునే ముందు అన్ని తలుపులూ మూసివున్నాయో లేదో యెవరు చూస్తారు?"

"నేనే చూస్తాను."

"నిన్న రాత్రి తలుపులన్నీ మూసివున్నాయా?"

"నేను స్వయంగా చూశాను. అన్నీ మూసి వున్నాయి."

"అయితే దొంగలు యెలా లోపలకు వచ్చారు?"

ఆమె కాస్సేపు ఆలోచిస్తూ వుండిపోయింది.

"ఆయన బాత్‌రూమ్‌లోంచి తలుపు తెరచుకుని తోట లోకి వెళ్ళివుంటారు. తిరిగి వచ్చేటప్పుడు తలుపు మూసి గడియలు వేయడం మర్చిపోయి వుండొచ్చు. అలా అంతకు ముందు యెన్నిసార్లో జరిగింది."

"అప్పుడు యేం చేసేదానవు?"

"నాకు మెలుకువ స్తే వెళ్ళి తలుపులను మరోసారి చూసేదాన్ని. ఈ విషయం ఆయనతోకూడా చెప్పాను. దొంగలంటే ఆయన భయపడేవారు కాదు. 'దొంగలకు కావల్సింది డబ్బేగా. పట్టుకుపోనీ!' అనేవారు."

"ఈ దొంగలు డబ్బుతో తృప్తిపడలేదు. అతడి ప్రాణాన్ని తీసుకున్నారు" అన్నారు వాలిగారు.

"గదిలోకొచ్చిన ఆయన్ని చూసి వాళ్ళు భయపడి పోయారు. భయంవలనే వాళ్ళాయనని హత్యచేశారని నా అభిప్రాయం" అందామె సైకియాట్రిస్టులా.

చిరునవ్వుతో ఆయన ఆమెవైపు చూశారు.

"అమ్మాయి, బాగా చెప్పావు. వయస్సులో చిన్న దానివైనా నీ బుర్ర పెద్దది," అని ఆయన వెనక్కి తిరిగారు.

"వాలిగారూ!" పిల్చిందామె.

ఆయన ఆగి ఆమెవైపు చూశారు.

"ఇవాళ యింట్లో వంట చేయొద్దని ఆదిలక్ష్మితో చెప్పాను కాని కాఫీ అందరికీ సిద్ధంగా వుంచమన్నాను. మీరూ, గిరిగారూ, ఇన్‌స్పెక్టర్‌గారూ డైనింగ్ హాల్లోకి వెళ్ళి కాఫీ సేవించండి!" అందామె.

"అమ్మాయి, థాంక్స్! వెళ్తాం" అన్నారాయన.

5

డైనింగ్ హాలు బ్రహ్మాండంగా వుంది. విశాలమైన టేబుల్ వారనున్న కుర్చీల్లో ముగ్గురం కూర్చున్నాం. టేబుల్ మీద ఫార్మైకాషీట్ చక్కగా అమర్చబడింది. తళతళ మెరుస్తోంది.

ముప్ఫయిఐదేళ్ళ వయస్సులో వున్న ఒక స్త్రీ పెద్ద ప్లేటు తెచ్చి మా ముందు పెట్టింది. ప్లేటులో కేక్స్, బిస్కట్లు వగైరా వున్నాయి. ఆమె వెళ్ళిపోయింది. కాస్సేపయ్యాక తిరిగి వచ్చింది. కప్పులు, సాసర్లు, ఒక కెటిల్లో కాఫీ డికాక్షన్, మరో కెటిల్లో పాలు, పంచదార, కొన్ని చెంచాలు పెట్టి వెళ్ళిపోయింది.

ఆదిలక్ష్మి అంటే ముసల్దయి ఉంటుందని అనుకున్నాను. కాని ఈమె ముసల్ది కాదు. పొడుగ్గా, బలంగా వుంది. గోచీ పోసి మరాఠీ వారిలా చీర కట్టుకుంది. సిగ చుట్టుకుంది. నుదురుమీద పెద్ద బొట్టు. చేతికి బంగారం గాజులు. మెళ్ళో ఒంటిపేట గొలుసు. ఆమెది కోల

ముఖం. పెద్ద కళ్లు.

"ఇక్కడ నా పని పూర్తయినట్లే!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

వాలిగారు రెండు కేక్స్ తిని, బిస్కట్‌లను అందుకున్నారు. క్రాక్‌జాక్ బిస్కట్లను నేను ఆకలితో నమిలేస్తున్నాను.

"సుబ్బారావుభాయ్, నా పని యింకా ప్రారంభం కాలేదు" అన్నారు వాలిగారు నవ్వుతూ.

మూడు కప్పుల్లో డికాక్షన్ పోసి, కాఫీ కలిపాను. వాలిగారు కప్పును అందుకున్నారు. దూరంలో గుమ్మం ముందు నిలబడి వున్న ఆదిలక్ష్మి వంక చూస్తూ ఆయన కాఫీ తాగసాగారు. ఏదో పనున్నట్లు ఆమె వెనుదిరిగి వెళ్ళిపోయింది.

"గిరీ, మనం ఆదిలక్ష్మితో మాట్లాడాలి" అన్నారాయన.

"ఆమెను పిలవనా?" అడిగాను.

"వద్దు" అని వాలిగారు టేబుల్ని వేళ్ళతో కొట్టారు. కాస్సేపట్లో ఆదిలక్ష్మి మా ముందు కొచ్చింది. ఆమెవైపు ఆయన సూటిగా చూశారు.

"అమ్మాయి, నిన్న రాత్రి నువ్వు ఏం చూశావు?"

"ఏవో అరుపులు విని నేను లేచాను సార్, మెల్లిగా అమ్మగారి గదిలోకి వెళ్ళాను. అక్కడి దృశ్యాన్ని చూసి భయపడిపోయాను. మంచం వారగా అమ్మగారు కింద కూర్చుని వున్నారు. ఆమెను తాళ్ళతో బిగించి కట్టేశారు. తాళ్ళు విప్పాలని దగ్గరకు వెళ్ళాను. ఆమె పోలీసులకు ఫోన్ చెయ్యమన్నారు. చేశాను. పావుగంటలో వాళ్లు వచ్చారు" అంది ఆదిలక్ష్మి.

"గదిలోకొచ్చిన ఆ యిద్దర్నీ నువ్వు చూడలేదన్న మాట!"

"వాళ్ళను గురించి ఆమె చెప్పాక కిటికీలోంచి తోటలోకి చూశాను. చంద్రకాంతిలో రెండు ఆకారాలు నాకు దూరంలో కనిపించాయి. వాళ్ళను ఆపే శక్తి లేక వూరుకున్నాను."

"వాచ్‌మన్‌తో చెప్పితే అతడు ఆపేవాడుగా?"

"వంటమనిషికి ఆ ఆలోచనలు యెలా తట్టుతాయి సార్! అమ్మగారు చెప్పివుంటే అలా చేసేదాన్ని."

"వాళ్ళిద్దరూ యెటువైపు కనిపించారు?"

"దక్షిణం వేపు సార్!"

"బలరామ్ అప్పుడప్పుడు తలుపులు తెర్చి మూయడం మర్చిపోయేవాడా?"

"ఎన్నిసార్లో మర్చిపోయారు సార్. అమ్మగారు వెళ్ళి తలుపులు మూసొచ్చేవారు."

"అమ్మ గదిలోకి నువ్వు యెలా వెళ్ళావు? తలుపు తెర్చివుందా?"

"వెనుకవైపున్న తలుపును ఆమె దగ్గరగా మూసి ఉంచుతారు. ఆమె పిలిస్తే మేలుకొని నేనూ వెళుతూ వుంటాను."

"అమ్మాయి నీకు బొంబేలో తెలుసా?"

"చాలాకాలం నుంచి తెలుసండి. ఆమె తల్లికి అనారోగ్యంగా వున్నపుడు నేను వంట చేసి పెట్టేదాన్ని. బలరామ్‌గార్ని పెళ్ళాడి ఆమె యీ భవనంలోకి వచ్చారు. ఉత్తరం రాసి నన్ను రప్పించారామె" అంది ఆదిలక్ష్మి.

"నమ్ముకున్న వాళ్ళకు సహాయపడడం మానవధర్మం" అన్నారు వాలిగారు.

కాఫీ తాగడం ముగించి వాలిగారు కుర్చీలోంచి లేచారు. డైనింగ్ హాల్లోంచి హత్య జరిగిన గదివేపు నడిచారు. గది వెనుక తలుపు దగ్గరగా మూసివుంది. ఆయన తలుపును తోశారు. యటాచ్డ్ బాత్ రూమ్ గుమ్మం సమీపంలో వుందా వెనుక తలుపు.

"ఆదిలక్ష్మి యీ గుమ్మంలోంచే లోపలకు వెళ్ళి వుంటుంది!" అన్నారు వాలిగారు.

"అవును సార్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

గుమ్మం దాటి వాలిగారు గది నలువైపులా చూశారు. తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయారు.

ఎలక్ట్రిక్ బెల్ శబ్దం విని ఇన్‌స్పెక్టర్ బయటకు పరుగెత్తాడు. వాలిగారూ, నేనూ ముందు హాల్లోకి నడిచాము. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఒక వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అతడు పొట్టిగా, లావుగా వున్నాడు. ఖరీదయిన సూటు ధరించాడు.

"ఈయన అడ్వకేట్ చంద్రంగారు. బలరామ్‌గారి లీగల్ అడ్వయిజర్" అని అతడిని వాలిగార్కి సుబ్బారావు పరిచయం చేశాడు.

"వాలిగారూ! మీ పేరు తెలియనివారుండరు యీ లోకంలో!" అన్నాడు చంద్రం ఆయనకు నమస్కరిస్తూ.

వాలిగారు అతడివైపు చిరునవ్వుతో చూశారు.

"చంద్రం భాయ్. నువ్వు చాలా ఆలస్యంగా వచ్చావు!" అన్నారాయన.

"నేను ఊళ్ళో లేను సార్. ట్రెయిన్ దిగి యింటికొచ్చి యీ వార్త విన్నాను. వెంటనే యిక్కడి

కొచ్చాను."

వాలిగారు చుట్టపొగ పీల్చి వదులుతూ క్షణకాలం మౌనంగా వున్నారు.

"బలరామ్ యేదయినా వీలునామా రాశాడా?"

"నేను రాయమన్నాను, కాని ఆయన రాయలేదు. బలరామ్‌గారికి బద్ధకం ఎక్కువ! ఏ పనీ తొందరగా చెయ్యరు!" అన్నాడు చంద్రం.

"అతడి ఆస్తి ఎవరి కెళుతుంది?"

"సుమలత అతని భార్య. ఆమెకే వెళుతుంది."

వాలిగారు మాట్లాడలేదు. ముందు వాళ్లలో పచార్లు చేస్తూ వుండిపోయారు.

"మీరు నన్ను క్షమించాలి. నేను సుమలతతో మాట్లాడాలి" అన్నాడు చంద్రం.

"గో ఎ హెడ్!" అన్నారు వాలిగారు.

ఆలోచిస్తూ వాలిగారు బయటకు తోటలోకి నడిచారు. ఆయన్ని నేను వెంబడించాను. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు నా వెనకనే వున్నాడు.

సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, కాని కిరణాల్లో అంతగా వేడి లేదు. నాగులు, సోములు, తోటలో పని చేస్తున్నారు. వాలిగారు వాళ్ళ సమీపంలో ఆగారు.

"నాగులు, సోములు మీ రేనా?" అడిగారాయన.

"అవునయ్యా!" అన్నారు వాళ్ళు.

"క్రితం రాత్రి మీకు ఏవేనా అరుపులు వినపడ్డాయా?"

"లేదు సార్!" అన్నారు వాళ్ళు.

"మీరు తొందరగా నిద్రపోతారా?"

"పొగల్లా ఎద్దుల్లా పనిచేస్తాం. పెందరాళే భోజనం

చేసి నిద్రపోతాం” అన్నాడు నాగులు.

“వాడు నాటుసారా తాగి తొంగుంటాడు సార్!” అన్నాడు సోములు.

“నువ్వు తాగవా?” అడిగారు వాలిగారు.

“వాడూ నాలాగే తాగుతాడయ్యా!” అన్నాడు నాగులు.

“బలరామ్ గురించి మీరు యేం చెప్పగలరు?”

“ఆయనకు కోపం ఎక్కువ సార్. ఆయ నెప్పుడూ నిషాలో వుంటారు. కోపం వస్తే మమ్మల్ని కొడతారు. కొట్టిన మరు నిమిషంలో ఆయన పదిరూపాయలు యిచ్చి ఏదేనా కొనుక్కోమంటారు!” అన్నాడు సోములు.

“సుమలత ఎటువంటిది?” అడిగా రాయన.

“ఆమె అంతగా మాతో కలవదు సార్. మమ్మల్ని తిట్టదు, కొట్టదు. ఆమె లోకం ఆమెది” అన్నాడు నాగులు.

వాలిగారు తోటలో నడవసాగారు. ఇంటికి దక్షిణం వేపున ముగ్గురం నడుస్తున్నాం. కొంచెం దూరం వెళ్ళాక ఒక మడుగు మాకు కనిపించింది. అందులోని నీళ్ళవేపు చూస్తూ నిల్చున్నాను.

వాలిగారు మడుగు దగ్గరగా వెళ్ళారు. తడినేల మీదున్న జోళ్ళ ముద్రలు చూసి ఆయన ఇన్‌స్పెక్టర్ వేపు చూశారు.

“సుబ్బారావుభాయ్, లోపలకు మునిగి యీ మడుగులో యేదేనా వాళ్ళు పారేశారేమో మనం కనుక్కోవాలి” అన్నా రాయన.

“ఇందులో వాళ్ళు ఏం పారేస్తారు సార్?” అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు.

"చూశాక నీకు తెలుస్తుంది" అన్నా రాయన నవ్వుతూ.

6

హోటల్ మిడ్లాండ్ లోని రూమ్ నెంబరు 30 లో వాలిగారు పడకకుర్చీలో కూర్చుని దిన పత్రికను చూస్తున్నారు. ఆయన కెదురుగా సోఫాలో కూర్చుని నేను రీడర్స్ డైజస్టు చదువుతున్నాను.

ఇన్స్పెక్టర్ సుబ్బారావు హుషారుగా గదిలో కొచ్చాడు. "వాలిగారూ, ఆ మడుగులో ఏదో వుండ వచ్చు అని మీరు యెలా ఊహించారు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

వాలిగారు గంభీరంగా నవ్వారు.

"సుబ్బారావుభాయ్ వాళ్ళిద్దరూ పట్టుకు పారిపోయిన నల్లటి లెదర్ బాగ్ దొరికిందా?"

"గుడ్ గాడ్ అదెలా వూహించారు?"

వాలిగారి చెయ్యి తలమీదకు వెళ్ళింది.

"మైడియర్ ఫ్రెండ్, యిక్కడున్న బ్రెయిన్ సెల్స్ నాకు ఎంతో చెప్తూ ఉంటాయి! చాలామంది వాటిని ఉపయోగించరు!" అన్నారాయన.

సుబ్బారావు నా పక్కనే సోఫాలో కూర్చున్నాడు.

"వాలిగారూ, మడుగులో లెదర్ బాగ్ దొరికింది. అందులో ఎన్నో నగలూ, కొన్ని వెండి పాత్రలూ వున్నాయి."

"డబ్బు లేదా?"

"నోట్లు లేవు సార్. డబ్బును వాళ్ళు పట్టుకుపోయి వుంటారు. ఈ బాగ్ కోసం వాళ్ళు మళ్ళా వచ్చేవారు. ఎందుకో భయపడి వాళ్ళు ఆ బాగ్ ను మడుగులో పడేసి

వుండాలి," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సుబ్బారావు భాయ్, ఈ దొంగలు విచిత్రంగా ప్రవర్తించారు. వాళ్ళు ఉపయోగించినవన్నీ యింట్లో దొరికినవే!"

అర్థంకానట్లు సుబ్బారావు ఆయనవైపు చూశాడు.

"సుమలతను బాధించిన నైలాన్ తాడు యింట్లోదే. బలరామ్‌ని చంపిన కత్తి గదిలో వున్నదే. ఆ లెదర్ బాగ్, అందులోని నగలు అన్నీ బలరామ్ యింటికి చెందినవే. దాన్నిబట్టి ఆలోచిస్తే ఏ ఆయుధాలూ లేకుండా ఆ దొంగలు యింట్లోకి ప్రవేశించారు అని పిస్తుంది. సుబ్బారావు భాయ్, దొంగతనం చేయదల్చిన వాడు బోడి చేతుల్తో వెళ్ళడు!"

"యూ ఆర్ రైట్, వాలిగారూ," అన్నాను.

"ఈ దొంగలు మూర్ఖులై ఉండాలి సార్," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నువ్వు పొరబడ్తున్నావు. బాజీ ప్రసాద్, తాజీ ప్రసాద్. మూర్ఖులు కారు. ఈమధ్య ఎన్నో దోపిడీలు వాళ్ళు విజయవంతంగా సాగించారు. వాళ్ళను గురించి పత్రికల్లో ఎంతో వచ్చింది. వేలకువేలు దోచుకుని వాళ్ళు పారిపోగల్గారు. అటువంటి ఆరితేరిన దొంగలు బలరామ్ యింట్లో ప్రవేశించి పెద్దపెట్టున దోచుకోకుండా ఎందుకు పారిపోయారు?" వాలిగారు ప్రశ్నించారు.

"ఇది సరైన ప్రశ్నే, సార్," అన్నాడు సుబ్బారావు.

"బలరామ్‌ని చంపి, ఆమెని బంధించి అంత తతంగం చేసి చివరకి లెదర్ బాగ్‌ను మడుగులో పారేసి వాళ్ళు పోతారా?" అడిగారు వాలిగారు.

"అయితే యీ దొంగతనం వాళ్ళు చెయ్య లేదంటారా?"

వాలిగారు మాట్లాడలేదు. సీలింగ్ వైపు చూస్తూ మౌనంగా ఉండిపోయారు.

"సుములత వాళ్ళను బాగా వర్ణించింది. దినపత్రికలోని ఫోటో చూపిస్తే 'అలాగే ఉన్నారు', అందామె."

వాలిగారు నవ్వారు.

"ఈ మధ్య ఎక్కడ దొంగతనాలు జరిగినా అందరూ వాళ్ళనే వర్ణిస్తున్నారనుకుంటాను," అన్నారు వాలిగారు.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆయనవంక సూటిగా చూశాడు.

"వాలిగారూ, యీ దొంగతనం చేసినవాళ్ళు బాజీ ప్రసాద్, తాజీ ప్రసాద్ కాదని మీ నమ్మకమా?"

"వాళ్ళిద్దరూ యింతవరకూ ఎవరినైనా చంపారా?"

"లేదు," అన్నాడు సుబ్బారావు.

"బలరామ్ బలమైనవాడు కాదు. అతడిని చంపవలసిన అవసరంలేదు. సుమలతనూ, అతడినీ కూడా తాళ్ళతో కట్టిపడేసి దొంగలు పని ముగించుకుని పోవచ్చు. మరో విషయం! డబ్బుకోసం దొంగతనం చేసేవాళ్ళు దొంగి లించిన సొత్తును ఏ మడుగులోనో పారేయరు? ఇదంతా సిల్లీగా వుంది! మైడియర్ ఫ్రెండ్! యీ దొంగతనం చేసినవాళ్ళు కావలసింది డబ్బుకాదు, బలరామ్ ప్రాణం!" అన్నారు వాలిగారు గంభీరంగా.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆశ్చర్యపోతూ చూశాడు.

"మీరు చెప్పింది నిజమేననిపిస్తోంది!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

వాలిగారు పడక కుర్చీలోంచి లేచారు. గదిలో

కొంతసేపు పచార్లుచేసి మా కెదురుగా ఆగారు.

"బలరామ్ హత్య ఎలా, ఎందుకు జరిగిందో కొంత వరకు నాకు తెలుసు. మరి కొంత సమాచారం నాకు కావాలి. ఆటుపైన పూర్తిగా నిజం తెలుస్తుంది," అన్నారు వాలిగారు.

"వాలిగారూ మీ రెవర్ని అనుమానిస్తున్నారు?"

"అందర్నీ అనుమానిస్తున్నాను. హత్య సమయంలో నువ్వు అక్కడుంటే నిన్నూ అనుమానిస్తాను" అన్నారు వాలిగారు నవ్వుతూ.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు సోఫాలోంచి లేచాడు.

"వాలిగారూ, ఏదో తేల్చి నాకు సహాయపడండి. పనులున్నాయి, వెళ్ళొస్తాను సార్," అన్నాడతను.

"సుబ్బారావు భాయ్, ఇదంత తొందరగా తేలదు. సరైన సమయం వచ్చినదాకా మనం వేచివుండాలి," అన్నారు వాలిగారు.

7

రోజులు గడిచిపోతున్నాయి. కాని వాలిగారి పరిశోధన ఏ మాత్రం ముందుకు పోలేదు. ఆయన అప్పుడప్పుడు ఫోన్ చేసి బొంబేలోని ఇన్‌స్పెక్టర్ డోంగ్రేతో మాట్లాడేవారు.

నెల్లూరులో యింకా ఎంతకాలం వుండాలో, అని నేననుకునేవాడిని.

ఆనాడు ఆదివారం. వాలిగారు ముస్తాబై "రా, గిరీ," అన్నారు.

ఇద్దరం కారువైపు నడిచాం. కారును సుమలత యింటికి పోనిచ్చాం. వాలిగారు మౌనంగా కూర్చున్నారు. ఇన్ని రోజుల తర్వాత ఆమె యింటికి ఆయన ఎందుకు

వెళ్తున్నారు? ఏదేనా ఆయన కనుక్కున్నారా?

ఒక్కోసారి ఎంత అడిగినా ఆయన జవాబివ్వరు. ఆయన చెప్పాలని నిశ్చయించుకున్నదాకా మనం వేచి ఉండవలసిందే!

పార్కింగ్ ప్లేస్‌లో కారాపి దిగాను—వాలిగారు కారు పక్కనే నిలబడి నలువైపులా చూశారు—తోట పనిచేసేవాళ్ళు ఎక్కడా కనపడ్డంలేదు. గూర్ఖామాత్రం గేటుముందు వున్నాడు—

కనుచూపు మేర చెట్లు, పూలమొక్కలు కనిపిస్తున్నాయి. భవనం ముందునుంచి చూస్తే ప్రహరీ గోడ కనపడదు. అది చాలా దూరంలో వుంది.

ముందు వరండా మీద నడిచి వాలిగారు గుమ్మంవైపు నడిచారు. ముందు గుమ్మం తలుపు మూసి ఉంది. వేళ్ళతో ఆయన తట్టారు.

తలుపు తెరవబడింది. మా ఎదురుగా సుమలత నిలబడి ఉంది!

"రండి, కూర్చోండి," అందామె.

వాలిగారూ, నేను సోఫాలో కూర్చున్నాం. మా కెదురుగా సోఫాలో ఆమె ఆశీనురాలైంది.

ఆమె వైపు పరీక్షగా చూశాను. తెల్లటి చీర, జాకెట్‌లో ఆమె మల్లెపువ్వులా కనిపిస్తోంది. ఒంటిమీద ఎక్కువగా నగలులేవు. నుదురుమీద తిలకంలేదు.

"అమ్మాయి, ఎలా ఉన్నావు?"

ఆమె అదోలా నవ్వింది.

"వాలిగారూ, ఏంచెప్పను? ఆయన పోయాక నా భర్త విలువను నేను గుర్తించగలాను. ఆయన అనేక కంపెనీలను ఫోన్‌లో మాట్లాడ్తూ నడిపేవారు. ఎప్పుడో

గాని ఆఫీసుకు వెళ్ళేవారు కాదు. ఇప్పుడు ఆ కంపెనీల మేనేజర్లు నన్ను చంపుకుతింటున్నారు. రోజుకు 200 ఫోన్ కాల్స్! ఇదంతా ఆయన ఎలా చూసేవారో!" అందామె.

"అమ్మాయి, నువ్వు నీరసంగా కనిపిస్తున్నావు. కొంత కాలంపాటు చల్లటి ప్రదేశానికి వెళ్ళి విశ్రాంతి తీసుకోడం మంచిది," అన్నాడు వాలిగారు.

"మా డాక్టర్ గారు కూడా అదే చెప్పారు. త్వరలో కాశ్మీర్ వెళ్ళాలి అనుకుంటున్నాను. ఇంత హఠాత్తుగా ఆయన హత్యచేయబడ్డం నా మెదడుకు షాక్ గా పరిణమించింది. ఈ యింట్లో రాత్రిళ్ళు నిద్రబట్టడంలేదు. విస్కీ బాటిల్ చేత్తో పట్టుకుని ఆయన తిరుగుతున్నట్లు అనిపిస్తోంది!"

ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. చీరచెంగుతో ఆమె కళ్ళు తుడుచుకుంది.

"అమ్మాయి, నువ్వు చిన్నవయస్సులో ఉన్నావు. అందగత్తెవు. ఇప్పుడు కోట్లు నీ చేతిలో వున్నాయి. ఎక్కడికెళ్ళినా నువ్వు జాగ్రత్తగా వుండాలి!"

"వాలిగారూ, మీరు చెప్పింది నిజమే. ఆయన ఉన్నప్పుడు నేను చీకూ చింతాలేకుండా బ్రతికేదాన్ని."

వాలిగారు ఆమెవంక నవ్వుతూ చూశాడు.

"పోయిన నగలన్నీ దొరికాయని విన్నాను," అన్నారు.

"వాటిని చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఆ దుర్మార్గులు తొందరపడి ఆయన ప్రాణం తీసుకున్నారు!" అందామె.

ఆదిలక్ష్మి ట్రేతో హాల్లోకొచ్చింది. టీపాయిమీద

ఆమె ట్రే పెట్టి వెళ్ళిపోయింది. ఆమెవైపు వాలిగారు పరీక్షగా చూస్తూ ఉండిపోయారు.

"ప్లీజ్, కాఫీ తీసుకోండి!" అంది సుమలత.

"కాశ్మీర్ ప్రయాణం ఎప్పుడు?" అడిగారాయన కాఫీ కప్పును తీసుకుంటూ.

"రెండు మూడు రోజుల్లో వెళ్తాను. శ్రీనగర్‌లో ఆయనకు పెద్ద భవనం వుంది. మా పెళ్ళయినాక మూడు నెలలు ఆ భవనంలో ఉన్నాం."

"కూడా ఎవర్నైనా తీసుకెళ్ళడం మంచిది!"

"ఎవరున్నారు నాతో రాడానికి? ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మలేం. ఆదిలక్ష్మిని తీసుకెళ్తే కాస్త వండి పడేస్తూ ఉంటుంది," అందామె.

"గుడ్," అని ఆయన సోఫాలోంచి లేచారు.

ఆమె మా వెనకనే వరండా మీదకు వచ్చింది.

"వాలిగారూ, మళ్ళా మనం ఎప్పుడు కల్సుకుంటామో తెలియదు. నా భర్త హత్యకేసులో మీరుపడ్డ శ్రమకు థాంక్స్," అందామె.

"డోంట్ బాదర్! నేను కూడా రేపు మద్రాస్ వెళ్ళిపోతున్నాను. ఇక్కడుండి చేయగలిగినది ఏమీ లేదనిపిస్తోంది." అన్నాడాయన.

"అవును, నిజమే," అందామె.

వాలిగారు కూర్చున్నాక కారును గేటువైపు పోనిచ్చాను.

8

పాకింగ్ ముగించి గుమ్మంవైపు చూశాను. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు సగర్వంగా గదిలోకొచ్చి వాలిగారి ముందుకు నిలబడ్డాడు.

"వాలిగారూ, సెన్సేషనల్ న్యూస్! రేపీపాటికి ప్రతి దిన పత్రికలోనూ యీ వార్త ఉంటుంది!" అన్నాడతను ఉద్రేకంతో.

"బలరామ్ హంతకులు దొరికారా?" అడిగారు వాలిగారు.

"అవును, సార్. ట్రంక్ రోడ్డుమీద ఒక బస్సును ఆపి వాళ్ళిద్దరూ పాసింజర్లనుంచి డబ్బు దోచుకుంటున్నారు. వాళ్ళ చేతుల్లో టాయ్ పిస్టల్సు ఉన్నాయి. ఈ రహస్యం బస్సులోని వాళ్ళకు తెలియదు. అదృష్టవశాత్తూ జీప్‌లో అటువైపు నేను వస్తున్నాను. జీప్ ఆపి వాళ్ళను ఎదిరించి, బెదిరించి అరస్టుచేసి స్టేషన్‌కు చేర్చాను. సుమలత వర్ణించినట్లే ఉన్నారు వాళ్ళు. వాళ్ళను చితకబాది నిజం ఒప్పుకునేటట్లు చేశాను. బలరామ్‌ని వాళ్ళే చంపారు. నాముందు ఒప్పుకున్నారు," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నీ టార్చర్‌కి భయపడి చెయ్యని నేరాన్ని వాళ్ళు ఒప్పుకున్నారేమో!" అన్నారు వాలిగారు నవ్వుతూ.

"వాలిగారూ, నాలుగు దెబ్బలుపడితేగాని ఎవ్వరూ నిజం చెప్పరు!"

"సుబ్బారావు భాయ్, గుడ్‌లక్! బలరామ్ హంతకులు తటాలున నీముందు వచ్చిపడ్డారు. అందుకు సంతోషించి వాళ్ళమీద కేసు బనాయించు!"

"మీరొకసారి వచ్చి వాళ్ళతో మాట్లాడ్డం మంచిది!"

"నేను రావడంవల్ల లాభించదు. అయినా రాడానికి నాకు అభ్యంతరంలేదు," అన్నారు వాలిగారు.

"ప్లీజ్, రండి."

జీప్ వెనక నే కారును పోనిచ్చాను. పోలీస్ స్టేషన్

ముందు కారును ఆపారు.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుతో వాలిగారూ, నేనూ లోపలున్న గదిలోకి వెళ్ళాం. ఊచలగదిలో వున్న వాళ్ళిద్దరివైపూ వాలిగారు చూశారు.

వాళ్ళ శరీరాలమీద యెన్నో గాయాలు వున్నాయి. చర్మాన్ని చెక్కేసిన సూచనలు కనిపిస్తున్నాయి. కాలుతున్న సిగరెట్‌ని అక్కడక్కడ అంటించిన బొబ్బలు అగుపిస్తున్నాయి.

వాళ్ళవైపు వాలిగారు జాలిగా చూశారు. "బలరామ్‌ని హత్యచేసినట్లు మీరు ఒప్పుకున్నారా?" ప్రశ్నించారు వాలిగారు.

"బ్లేడుతో చర్మాన్ని చెక్కుతూంటే ఒప్పుకోక ఏం చేస్తాం సార్?" అన్నాడు ఒకతను.

"మాకేం తెలీదంటే యింకా బాధపడాలి. అన్నిటికీ ఒప్పేసుకున్నాం" అన్నాడు రెండోవాడు.

వాలిగారు చుట్టపొగ వదుల్తూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వంక చూశారు.

"సుబ్బారావ్ భాయ్, యీ రోజుల్లో దేశమంతటా పోలీసులకు చాలా చెడ్డపేరు ఏర్పడింది. పోలీసులు రేప్ కేసుల్లో యిరుక్కుంటున్నారు. నువ్వు వాళ్ళను అమానుషంగా టార్చర్ చేయించావు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి పోలీసు పద్ధతులకు తావులేదు. ఇటుపైన ఇటువంటి హింసాకాండలు జరగనీకుండా చూడు!" హెచ్చరించారు వాలిగారు గంభీరంగా.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ముఖంలో నెత్తురు చుక్క లేదు. "డాక్టర్ని పిలిపించి వాళ్ళకు ట్రీట్‌మెంటు యిప్పించు! ప్రజల రక్షణకోసం పోలీసుశాఖ వుద్భవిం

చింది. అమాయకులను పీడించడానికి కాదు!"

"వాలిగారూ, వీళ్ళు బస్సును ఆపి డబ్బు దోచు కుంటున్నారు. అది నిజం. నేను స్వయంగా చూశాను," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆ నేరంమీద వాళ్ళను అరెస్టు చేసి, కేసు పెట్ట వచ్చు. తగు విధంగా వాళ్ళకు శిక్ష పడుతుంది" అన్నా రాయన.

వాలిగారూ, నేనూ బయటనున్న కారు దగ్గరకు నడిచాం. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మా వెనకనే వచ్చాడు. చుట్ట పీలుస్తూ వాలిగారు సీటుమీద కూర్చున్నారు.

"వాలిగారూ, బలరామ్‌గారి హత్యకేసు అలా ఫైల్లో పడుండవలసిందేనా?" అడిగాడు సుబ్బారావు.

"సుబ్బారావ్ భాయ్, వసంతం వచ్చిందని తొందర పడి ఒక కోయిల ముందే కూసిందట. నువ్వూ అలా తొందరపడకు. బలరామ్ హంతకులు త్వరలో నాకు దొరుకుతారు. నిజంకోసం మనం కొంతకాలం నిల్చుని వుండాలి" అన్నారు వాలిగారు.

"అలాగే సార్," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కారును పోనిచ్చాను. పక్కన కూర్చున్న వాలిగారు నా వైపు ఓరగా చూశారు.

"గిరీ, హోటల్‌నుంచి వెంటనే మద్రాస్ పోదాం," అన్నారాయన.

ఆయన మాటలు విని ఆశ్చర్యపడ్డాను.

"ఈ కేసును వదలుకున్నట్టేనా?" అడిగాను.

"మద్రాస్‌నుంచి కాశ్మీరు వెళ్దాం. ఆ శీతల ప్రదే శంలో నా బుర్ర అఖండంగా పనిచేస్తుంది."

తృప్తిపడ్డాను. కాశ్మీర్ అని ఆయన అనగానే నా

మెదడులో ఎన్నో దృశ్యాలు ప్రత్యక్షమయ్యాయి. సుమలత కూడా కాశ్మీరు వెళ్తోంది. అక్కడా మెను కల్సుకో వచ్చు.

కాని మరో ఆలోచన నా హృదయాన్ని పీకుతోంది. వాలిగారు కాశ్మీరు యెందుకు వెళ్తున్నారు? ఆయన సుమలతను అనుమానిస్తున్నారా?

హోటల్ కాంపౌండ్‌లో కారు ఆపాను. ఇద్దరం కిందకు దిగాం.

"పెటిల్ ది హోటల్ బిల్, పోదాం," అన్నారాయన.

9

కాశ్మీర్!

సూర్యుడు ప్రకాశిస్తున్నాడు కాని చల్లగావుంది. శ్రీనగర్ లోని రోడ్డమ్మట నడుస్తున్నాను. మూడు పెగ్గుల స్కాచ్ విస్కీ నన్ను వుషారుతో నింపింది.

పార్కుకు దూరంగా వున్న ఆ భవనంవైపు నడిచాను. గేటుముందు గూర్ఖా పచార్లు చేస్తున్నాడు. "శంకర్ భవన్" అని పెద్ద అక్షరాల్లో చెక్కబడివుంది.

గేటుముందు ఆగాను. గూర్ఖావైపు నవ్వుతూ చూశాను.

"బలరామ్‌జీ వచ్చారా?" అడిగాను హిందీలో.

"వాళ్ళు యివాళ రాత్రి వస్తారు" అన్నాడతను.

వెనక్కు తిరిగాను.

"నీకేం కావాలి?" అడిగాడతను.

"క్రొత్త కాశ్మీరుసిల్కు చీరలు వాళ్ళకు చూపించాలి," అన్నాను.

గూర్ఖా బీడీనిపీల్చి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

నేను వెనుదిరిగి వేగంగా వెళ్ళిపోయాను.

హోటలు శిసిల్ ముందుహాల్లోకి వెళ్ళాను. రూమ్ నెంబర్ 20 వైపు కదిలాను. తలుపుమీద తట్టాను.

"కమిన్!" అందో కంఠం లోపలనుంచి.

తలుపు తోసుకొని లోపలకు వెళ్లాను. పడకకుర్చీలో వాలిగారు కూర్చునివున్నారు. పక్కనున్న టీపాయిమీద స్కాచ్ విస్కీ బాటిల్, ఒక గ్లాసు, సోడావున్నాయి.

ఆయన నోట్లో చుట్ట వెలుగుతోంది. బుగ్గమీసాలు, ఆయన కళ్లు ఆ క్షణంలో భయంకరంగా వున్నాయి.

"వాళ్లింకా రాలేదు. ఈ రాత్రికి వస్తారు" అన్నాను.

"గుడ్. అంతవరకూ ఎంజాయ్ గిరీ!" అన్నారు వాలిగారు.

ఆయనకు నమస్కరించి సమీపంలో వున్న నా రూమ్ నంబరు 25 వైపు వేగంగా అడుగులేశాను.

* * *

రోడ్డు దీపాలు వెలుతున్నాయి. అతడు యింపాలా కారును పోనిస్తున్నాడు. చాలా చలిగావుంది. పక్క కూర్చున్న యువతి అతడి ఒళ్ళోకి ఒరిగిపోయింది.

అతడి ఎడం చెయ్యి ఆమెమీద వాలింది.

"లతా!" అన్నాడతను.

"రహీమ్!" అందామె.

"ఇంటికి పోదామా?"

"తొందరగా పోనీ! వెచ్చగా రొజాయికింద పడుకుందాం," అందామె.

కాస్సేపట్లో కారు గేటువైపు తిరిగింది. గూర్ఖా తలుపు తెరిచాడు.

"ఎవర్నీ లోపలకు రానివ్వకు" అందామె.

"జీ, సర్కార్," అన్నాడు గూర్ఖా.

కారు పోర్టికోలో ఆగింది. వాళ్లిద్దరూ దిగి లోపలకు వెళ్లారు. అతడు లైటు స్విచ్‌ని నొక్కాడు. ఫ్లోరసెంటు లైటు వెల్గింది. ఆమె తలుపు మూసింది.

నవ్వుతూ పడగ్గదిలోనికి వెళ్ళిపోయింది. అతడు కాసే పయ్యాక పడగ్గదిలో ప్రవేశించాడు. అద్దం ముందు ఆమె నిలబడి వుంది.

ఆమె ధరించిన వులెన్ కోటును తీసేసింది. ఖరీదయిన ప్రింటెడ్ సిల్కుచీరలో వుందామె. రహీమ్ చేతులు వెనకనుంచి ఆమెను చుట్టేశాయి.

"డార్లింగ్!"

"మైడియర్," అని ఆమె వెనక్కు తిరిగింది.

వాళ్ళ పెదిమలు ఆవేశంతో హత్తుకుపోయాయి. ఆమె అతడివైపు తిరిగింది. చేతుల్ని అతడి వెనక పెనవేసింది.

రహీమ్ మళ్ళా ఆమెను ముద్దెట్టుకున్నాడు.

"రహీమ్, ఐ లవ్ యూ!" అందామె.

"నీకోసం ఏదయినా చేస్తాను, లతా!" అన్నాడు రహీమ్ ఉద్రేకంతో.

కిటికీలకు కప్పిన కర్టెన్‌లు రెపరెపలాడాయి. ఇద్దరూ కిటికీవైపు చూశారు.

"దయ్యాల్లో నీకు నమ్మకముందా?" అడిగిందామె.

"దయ్యాలూ గియ్యాలూ లేవీ లోకంలో! బలరామ్‌గాడి దయ్యం యిక్కడికొచ్చి నిన్ను పీడిస్తుందని భయపడకు!" అన్నాడతను.

పడగ్గదిలోని లైటు ప్రకాశవంతంగా వెలుగుతోంది. కర్టెన్ వెనకనుంచి వాలి భయంకర రూపం వాళ్ళవైపు

కదిలింది.

వాలిని చూసి ఆమె కెవ్వున అర్చింది. మరో కర్టెన్ వెనుకనుంచి నేను బయటకొచ్చి వాలిగారి పక్క నిలబడ్డాను.

నేలమీద ఆమె కుప్పలా కూలిపోయింది. ఆమెపక్కనున్న యువకుడి మొహంలో నెత్తురు చుక్కలేదు.

వాలిగారు అతడివైపు తీక్షణంగా చూశారు. "మిస్టర్ ఆదిలక్ష్మీ!" అన్నారాయన.

నేను తృళ్ళిపడ్డాను. వాలిగారి మాటలు విన్నదాకా అతడు ఆదిలక్ష్మిగా నటించినతనని నేననుకోలేదు. అతడివైపు పరీక్షగా చూశాను. సందేహం లేదు. వంటామె ఆదిలక్ష్మిగా ఇంతకాలం బలరామ్ యింట్లో పనిచేసిన వ్యక్తి అతనే!

వాలిగారు చుట్ట పొగపీల్చి వదలుతూ వాళ్ళవైపు చూశారు.

"అమ్మాయి, నెల్లూరులో చీకట్లో చిందులాడాను. శ్రీనగర్ వెలుతురులో నన్ను తికమకలు పెట్టిన కేసుకు సొల్యూషన్ దొరికింది," అన్నారు వాలిగారు.

సుమలత కోపంగా వాలిగారివైపు చూసింది.

"నేను నా భర్తను చంపానంటారా?" అడిగిందామె.

"నువ్వు చంపలేదు కాని హంతకుడిని కప్పిపుచ్చావు!" అర్చారు వాలిగారు.

"ఆదిలక్ష్మిగా యితడు నటించి వుండొచ్చు. అయినా నా భర్తను చంపితే యితడికేముస్తుంది?"

వాలిగారు కొంతసేపు నిశ్శబ్దంగా వుండిపోయారు. ఆమెవైపు సూటిగా చూశారు.

"బలరామ్‌ను ఎందుకు హత్యచేయవలసి వచ్చిందో

యిప్పుడు నాకు అర్థమైంది! బొంబేలో నువ్వు రహీమ్‌ని ప్రేమించావు. మీరిద్దరూ కలిసి తిరిగేవారు. ఇదంతా ఇన్‌స్పెక్టర్ డోంగ్రే నాకు చెప్పాడు. ఇంతలో నీకు బలరామ్‌తో పరిచయమైంది. మీ ప్రేమ బలరామ్ కోట్లను వదులుకోలేకపోయింది. బలరామ్‌ని పెళ్ళాడావు. రహీమ్‌ని ఆదిలక్ష్మి వేషంలో నీ యింటికి తెప్పించు కున్నావు. తప్పతాగి పడుండే బలరామ్‌కి యిదంతా తెలియదు. నువ్వు తలుపు తెర్చివుంచేదానవు. రహీమ్ రాత్రిళ్ళు నీ గదిలోకొచ్చి నిన్ను అనుభవించేవాడు.. బలరామ్ ధనం నీ ప్రియుడు రహీమ్ సంపర్కం—అన్నీ నీకు లభిస్తున్నాయి!"

వాలిగారు ఆగారు. రహీమ్ నేలమీద ఆమె పక్కనే కూర్చున్నాడు.

"ఆనాటి రాత్రి బలరామ్ నీ గదిలోకొచ్చి లైట్ ఆన్ చేశాడు. మీరిద్దరూ పరుపుమీద మరో లోకంలో వున్నారు. గోడకు వేళ్ళాడుతున్న కత్తి తీసుకుని బలరామ్ మీ వైపు వచ్చాడు. ఆదిలక్ష్మిగా నటిస్తూన్న రహీమ్ అతడివైపు దూకి, బలరామ్ చేతిలోని కత్తిని లాక్కొని అతడి మెడను నరికేశాడు. బలరామ్ నేల కూలాడు. తర్వాత ఆ హత్యను కప్పిపుచ్చడానికి మీ బుర్రలు పనిచేశాయి. బాజీ ప్రసాద్, తాజీ ప్రసాద్ ఎన్నో దొంగతనాలు చేశారని మీకు తెలుసు. పత్రికల్లో వాళ్ళ ఫోటోలను మీరు చూశారు. ఇదంతా వాళ్ళిద్దరూ చేసినట్లు కల్పించడానికి మీరు తాపత్రయపడ్డారు. ఆ రెండు గ్లాసుల్లోనూ విస్కీ పోసుకుని తాగింది మీరే! బలరామ్‌ని హత్యచేయవలసి వచ్చింది. ఆ స్థితిలో మీలో చెలరేగే భయాన్ని పోగొట్టుకోడానికి మీరు

విస్కీ తాగారు. కొన్ని నగలు లెదర్ బాగ్‌లో పడేసి ఆ బాగ్‌ను సమీపంలో వున్న మడుగులో పడేసివచ్చాడు రహీమ్. రహీమ్ నిన్ను తాళ్ళతో కట్టేసి పోలీసులకు ఫోన్ చేశాడు, ఆదిలక్ష్మీలా!"

గదిలో లైట్ వెలుగుతోంది. వాళ్ళిద్దరూ తలల వాల్చేసి కూర్చున్నారు. ఆరిపోయిన చుట్టను వాలిగారు లైటర్‌తో వెలిగించారు.

"ఆదిలక్ష్మి నీ ప్రియుడు రహీమ్ అని ఎవ్వరూ గుర్తించరని మీరు భావించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు నా సలహా కోరతాడని మీరు కలగనలేదు!" అన్నారు వాలిగారు గంభీరంగా.

వాలిగారు నా వైపు తిరిగారు.

"గిరీ, పోలీస్ కమీషనర్ నక్వీకి ఫోన్ చేసి, నా పేరు చెప్పి వెంటనే యిక్కడకు రమ్మను!"

గదిలో వున్న ఫోన్ దగ్గరకు పరుగెత్తాను. నక్వీతో మాట్లాడి వాలిగారి దగ్గరకు తిరిగొచ్చాను.

"ఆయన వెంటనే వస్తానన్నారు," అన్నాను.

"గిరీ, నువ్విక్కడే వుండు! వాళ్ళు కదలకుండా చూడు," అని వాలిగారు చుట్ట పీలుస్తూ, తళ-తళ మెరిసే కళ్ళతో ముందు హాల్లోకి వెళ్ళిపోయారు.

నేలమీద కూర్చున్న వాళ్ళిద్దరివైపు చూస్తూ జేబు లోంచి పాకెట్ తీసి, సిగరెట్ వెలిగించాను.

—: ఐపోయింది :—